నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
I హైదరాబాద్, ఆదివారం 28 ఏప్రిల్ 2024 SANGAREDDY


సిద్దిపేటలో ఎమ్మెల్యే హరీశ్‌రావును సన్మానిస్తున్న బ్రాహ్మణ పరిషత్ సభ్యులు

> కాంగ్రెస్ సర్కారు వచ్చీ రాగానే ఉమ్మడి మెదక్ జిల్లాపై కక్షగట్టింది. బీఆర్‌ఎస్ హయాంలో మెదక్‌కు 100 సీట్లతో మెడికల్ కళాశాలను కేసీఆర్ మంజూరు చేస్తే, సీఎం రేవంత్‌రెడ్డి దానిని 50 సీట్లకు కుదించి కొడంగల్ తీసుకుపోయిండు. గజ్వేల్‌కు కేసీఆర్ కేటాయించిన రూ.150 కోట్ల నిధులను రద్దుచేశాడు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలకు మంజూరైన రోడ్ల నిధులును రద్దుచేసిండు. అనేక అభివృద్ధి పనులు ఆపిండు. సిద్దిపేట నుంచి కార్యాలయాలను, విద్యాలయాలను తరలించేందుకు కుట్ర చేస్తున్నాడు. సిద్దిపేట జిల్లాను రద్దు చేస్తామని అంటున్నారు. ప్రజలారా ఆలోచించండి. మనపై కక్షగట్టిన కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధిచెప్పండి.
>
> – సిద్దిపేటలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

## బ్రాహ్మణ బంధువు కేసీఆర్

### దేశంలోనే తొలి బ్రాహ్మణ సదనం సిద్దిపేటలో నిర్మాణం

- సిద్దిపేట స్ఫూర్తితో హైదరాబాద్‌లో నిర్మాణం
- మాజీ మంత్రి హరీశ్ రావు

సిద్దిపేట, ఏప్రిల్ 27: దేశంలోనే తొలి బ్రాహ్మణ సదనం సిద్దిపేటలో నిర్మించుకున్నామని, దీని స్ఫూర్తితోనే హైదరాబాద్‌లోనూ బ్రాహ్మణ సదనం ఏర్పాటు చేశామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయంలో శనివారం బ్రాహ్మణ పరిషత్ పెద్దలు హరీశ్‌రావును కలిసి బ్రాహ్మణ పరిషత్ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే మీ అందరి ఆశీస్సులతో పదేండ్ల పాలనలో యాదాద్రి నిర్మాణంతో పాటు రాష్ట్రంలో అనేక ఆలయాలను నిర్మించిన ఘనత కేసీఆర్‌కు చెందిందన్నారు. అర్చకులకు రూ.10 వేల ధూప దీప నైవేద్యాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందించిందన్నారు. సిద్దిపేటలో రూ.40 కోట్లతో అనేక ఆలయాలను నిర్మించుకున్నట్లు తెలిపారు. బెస్ట్ స్కీం ద్వారా ఉపాధి కల్పనకు, బ్రాహ్మణ పరిషత్‌కు నిధులను కేటాయించిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. బీసీ, ఎస్సీ, ఇతర వర్గాల మాదిరిగా బ్రాహ్మణులకు సైతం విదేశీ విద్య కోసం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. సిద్దిపేటలో ఏ ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగినా, ఏ పీఠాధిపతి వచ్చినా ముందుండి కార్యక్రమాన్ని నడిపించామని హరీశ్‌రావు గుర్తుచేశారు. బ్రాహ్మణ పరిషత్ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే బ్రాహ్మణులకు తగిన గౌరవం లభించిందని, మీ ఆశీర్వాదాలు తమకు బలమని హరీశ్‌రావు పేర్కొన్నారు.



# తెగించి కొట్లాడితేనే తెలంగాణ వచ్చింది


సిద్దిపేటలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, పాల్గొన్న పార్టీ శ్రేణులు


బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

- తెలంగాణను దేశంలో ఆదర్శంగా నిలిపినం
- నాడు ఉద్యమంలో రాజీనామా చేయమంటే వెన్నుచూపి పారిపోయిన వ్యక్తులు రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి
- జిల్లాలు రద్దు చేస్తామన్న కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 27: తెగించి కొట్లాడితేనే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని, దీనికోసం ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేశామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బీఆర్‌ఎస్ 24వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కేంద్రమైన సిద్దిపేటలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తన్నీరు హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్య మం కోసం 2001లో కోనాయిపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేసి, నాంపల్లి దర్గాలో ప్రార్థనలు చేసి టీడీపీ సభ్యత్వానికి,

### పదేండ్ల కేసీఆర్ పాలన దేశానికి ఆదర్శం

ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ పదవులకు కేసీఆర్ రాజీనామా చేసి ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు. ఎన్నో అవమానాలు ఎదురైనా తట్టుకుని రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అన్నారు. కేసీఆర్ లేకుంటే తెలంగాణ రాష్ట్రం లేదని, మన రాష్ట్రం లేకుంటే సిద్దిపేట జిల్లా అయ్యేది కాదన్నారు. పదేండ్ల కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శమన్నారు. బీఆర్‌ఎస్ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను కేంద్రం, ఇతర రాష్ట్రాలు కాపీ కొట్టి అమలుచేశాయన్నారు. రైతుల ఖాతాల్లోకి నగదు బదిలీ చేసిన ఏకైక నాయకుడు కేసీఆర్ అన్నారు. కేసీఆర్ అభివృద్ధిలో తెలంగాణను దేశంలోనే మోడల్‌గా నిలిపితే, నేడు కాంగ్రెస్ సర్కారు తిరోగమనం పాలుచేసిందన్నారు. హామీలపై ప్రశ్నిస్తే సీఎం రేవంత్‌రెడ్డి చిల్లర మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. సిద్దిపేట జిల్లాను రద్దు చేస్తామంటే, ఈ జిల్లా ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమంలో పదవులకు రాజీనామా చేయమంటే వెన్నుచూపిన వ్యక్తులు కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి అని హరీశ్‌రావు విమర్శించారు. ఈ నాయకులు ఆంధ్రా నాయకుల అడుగులకు మడుగులు వొత్తి తెలంగాణకు అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. తమకు పదవులు ముఖ్యం కాదని, ఎన్నోసార్లు పదవులకు రాజీనామాలు చేసి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజారాధాకృష్ణశర్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, నాయకులు వంగా నాగిరెడ్డి, ఎంపీపీ మాణిక్యరెడ్డి, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, కొండం సంపత్‌రెడ్డి, మోహన్‌లాల్, బాల సాయిరాం, గ్యాదర్ రవీందర్, అల్లం ఎల్లం, ఆయా మండలాల పార్టీల అధ్యక్షులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సంగారెడ్డి జిల్లా ఆర్సీపురంలో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి; సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

# ఓట్లడిగే అర్హత బీఆర్‌ఎస్‌కే ఉంది

- పదేండ్లలో ఎంతో అభివృద్ధి చేశాం
- మెదక్ ఎంపీగా వెంకట్రామిరెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారు..
- బీజేపీతోనే మనకు పోటీ..
- కాంగ్రెస్ మూడో స్థానానికే పరిమితం
- బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం,ఏప్రిల్ 27: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేసిందని, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి ఓట్లు అడిగే హక్కు, అర్హత మనకే ఉందని పటాన్‌చెరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఆర్సీపురం డివిజన్‌లోని లక్ష్మీగార్డెన్స్‌లో బీఆర్‌ఎస్ నిర్వహించిన భారతీనగర్, ఆర్సీపురం డివిజన్ల కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ప్రొటెం మాజీ చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన తప్పిదాలను సరిచేసుకొని పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పటాన్‌చెరు డివిజన్ నుంచి ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి 70వేల మెజార్టీని తీసుకురావాలన్నారు. మెదక్ గడ్డపై ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తున్నారని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్, బీజేపీ మధ్యనే పోటీ ఉంటుందని, కాంగ్రెస్ అభ్యర్థికి మూడో స్థానం తప్పదన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ పది రోజులు గట్టిగా పనిచేయాలని సూచించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ఈ ప్రాంతంలో జోనల్ కమిషనర్‌గా, జాయింట్ కలెక్టర్‌గా, కలెక్టర్‌గా పనిచేసి ప్రజలకు సేవ చేశారని, సేవ చేసే గుణం ఉన్న ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలను ప్రజలకు వివరించాలన్నారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో మనం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓటు అడుగాలని అన్నారు.

### మంచి మనిషి వెంకట్రామిరెడ్డి

- ప్రొటెం మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి

ప్రొటెం మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ మన జిల్లాకు మంచి మనస్సున్న ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని ప్రకటించడం మన అదృష్టమని, ఆయనను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోనే జాయింట్ కలెక్టర్‌గా, కలెక్టర్‌గా ప్రజలకు సేవ చేసిన అనుభవం ఆయనకు ఉన్నదని, అలాంటి వ్యక్తిని గెలిపించుకుంటే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు పుష్పా నగేశ్, సింధూఆదర్శ్‌రెడ్డి, నాయకులు అంజయ్య, పరమేశ్, కుమార్‌గౌడ్, జగన్నాథ్‌రెడ్డి, నర్సింహ, ఐలేశ్, ప్రమోద్‌గౌడ్, సత్యనారాయణ, అజీముద్దీన్, రాణి, కృష్ణకాంత్, రాజు, అజీమ్, గఫర్, విష్ణువర్ధన్‌రెడ్డి, బూన్ తదితరులు పాల్గొన్నారు.

# సేవచేసే అవకాశం కల్పించాలి

### మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

- గజ్వేల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో విస్తృత ప్రచారం
- ప్రజల నుంచి విశేష స్పందన

గజ్వేల్, ఏప్రిల్ 27: మెదక్ ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని, సొంతంగా ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపడతానని మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. శనివారం గజ్వేల్‌లో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి ఇంటిగ్రేటెడ్ మార్కెట్, పట్టణంలో ఆయన విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలపై అవగాహన కలిగిన వ్యక్తిగా మీ ముందుకు వచ్చానని, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. కేసీఆర్ చేపట్టిన అభివృద్ధిలో తాను భాగస్వామిగా అన్నింట్లో పని చేశానని, కేసీఆర్ ఎంతో నమ్మకంతో తనకు మెదక్ ఎంపీగా అవకాశం కల్పించారన్నారు. గజ్వేల్‌లో తొమ్మిదేండ్ల కాలంలో అన్నిరంగాల్లో అభివృద్ధి పరుగులు పెట్టిందన్నారు. ఇంతటి అభివృద్ధి చేసిన కేసీఆర్ నిలబెట్టిన తనకు అవకాశం కల్పించి గెలిపించాలని కోరారు. ఒక్కసారి అవకాశం కల్పిస్తే ఎల్లప్పుడు మీ వెంటే ఉంటానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు రాధాకృష్ణశర్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, పట్టణ అధ్యక్షుడు నవాజ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


గజ్వేల్ సమీకృత మార్కెట్‌లో వ్యాపారిని ఓటు అడుగుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి


గజ్వేల్‌లో ఓటు అడుగుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి

# మే మొదటి వారంలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ

- సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, జహీరాబాద్ రిటర్నింగ్ అధికారి వల్లూరు క్రాంతి



సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 27: పార్లమెంట్ సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మే 1, 2, 7, 8 తేదీల్లో ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతి శనివారం తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బంది ప్రతిఒక్కరూ శిక్షణకు హాజరు కావాలన్నారు. ఈనెల 28న ఈవీఎంలపై శిక్షణ ఉంటుందన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మే 13న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం నియమించిన పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు, ఇతర ఎన్నికల సిబ్బందికి మే 1, 2, 7, 8 తేదీల్లో వారికి కేటాయించబడిన అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలు రెండు విడతల్లో ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. ఎన్నికల విధులు కేటాయించిన ఉద్యోగులందరూ విధిగా శిక్షణ కార్యక్రమాలకు హాజరుకావాలని ఆమె సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈనెల 28న ఆదివారం స్థానిక పీఎస్ గార్డెన్‌లో ఈవీఎంపై ఉదయం 7 గంటలకు ఏఆర్వోలు, ఆర్వోలు, సెక్టోరియల్ అధికారులకు, ఏఎల్ఎంటీలు, ఇతర సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు వివరించారు. శిక్షణకు ఆయా అధికారులందరూ విధిగా హాజరుకావాలని ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతి సూచించారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే దేశ భద్రతకు ముప్పు

- బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు


చిలిపిచెడ్‌లో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

చిలిపిచెడ్(కొల్చారం)/చేగుంట, ఏప్రిల్ 27: కాంగ్రెస్‌కు ఓటేస్తే దేశ భద్రత ప్రమాదంలో పడుతుందని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. శనివారం చిలిపిచెడ్, కొల్చారం, చేగుంట మండలాల్లో ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. చిట్కుల్, దుంపలకుంట, రంగంపేట్, చిన్న ఘనపూర్, పోతంశెట్‌పల్లి, అప్పాజిపల్లి గ్రామాల్లో రోడ్ షోలతో పాటు కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. చేగుంట మండలంలోని వడయారం గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ.. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే దేశానికి పెనుముప్పు కలుగుతుందని, దేశద్రోహులు పెరిగిపోతారని, కుంభకోణాలు, అన్యాయాలు జరుగుతాయన్నారు. అబద్ధాలు, అసత్యపు మాటలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ చిలిపిచెడ్ మండల అధ్యక్షుడు దయాకర్‌గౌడ్, నాయకులు మురళీయాదవ్, ఆంజనేయులుగౌడ్, హరీశ్, గిరి, గంగరాజు, వెంకట్, కృష్ణ పలువురు పాల్గొన్నారు. చేగుంట, నార్సింగి మండలాల మహిళా అధ్యక్షురాళ్లు లావణ్య, సుతారి రాజ్యలక్ష్మి, మాజీ జడ్పీటీసీ కర్ణశోభ పాండు, ఏఎంసీ మాజీ చైర్మన్ గడ్డమీది సుజాత,మహిళా నాయకురాలు జ్యోతి, పార్టీ చేగుంట మండల అధ్యక్షుడు చింతల భూపాల్, బాల్‌రెడ్డి,ర్యాపాకుల సతీశ్‌గౌడ్, కర్ణపాండు, గోవింద్, రతన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమం దేశానికే ఆదర్శం

- కేసీఆర్ పోరాటంతోనే ప్రత్యేక రాష్ట్రం సాకారం
- పదేండ్ల కేసీఆర్ పాలనలో అగ్రభాగాన తెలంగాణ
- అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్ సర్కారు
- కాంగ్రెస్, బీజేపీ చేసిందేమీ లేదు..
- బీఆర్‌ఎస్ ఆవిర్భా వ దినోత్సవంలో జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి
- పాల్గొన్న ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి
- ఆరుగ్యారెంటీలు, హామీలు విస్మరించిన కాంగ్రెస్: నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి


మెదక్‌లోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 27: తెలంగాణ ఉద్యమం దేశానికే ఆదర్శమని, బీఆర్‌ఎస్ ఏర్పాటు చేసి ప్రజాస్వామ్య ప్రక్రియ ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నేత కేసీఆర్ అని బీఆర్‌ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ 24వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మెదక్‌లోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీలు సుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, లేబర్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి తదితరులతో కలిసి పార్టీ జెండాను ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్ల పోరాటం, ఎన్నో త్యాగాలతో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ సర్కార్ మెడలు వంచి ప్రత్యేక రాష్ట్రాన్ని కేసీఆర్ సాధించారని గుర్తు చేశారు. కుట్రలు, ప్రలోభాలతో ఉద్యమాన్ని ఆపాలని కాంగ్రెస్ సర్కారు చూసిందన్నారు. రాష్ట్రం ఆవిర్భావం తర్వాత కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్నిరంగాల్లో అగ్రభాగానికి దూసుకెళ్లినట్లు తెలిపారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో సంక్షేమ స్వర్ణ యుగం అన్నారు. బీఆర్‌ఎస్ జెండా మోస్తున్న కార్యకర్తలకు పాదాభివందనం తెలియజేస్తున్నట్లు పద్మాదేవేందర్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ అమరుల త్యాగం మరువలేనిదని, వారి ఆకాంక్షల సాధనే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ముందుకెళ్తుందని స్పష్టం చేశారు.

**మెడికల్ కళాశాల సీట్లు కుదించడం తగదు...**

బీఆర్‌ఎస్ హయాంలో మెదక్‌కు 100 సీట్లతో మెడికల్ కళాశాల మంజూరు చేస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 50 సీట్లకు కుదించడం అభివృద్ధిని అడ్డుకున్నట్లేనని పద్మాదేవేందర్‌రెడ్డి విమర్శించారు. మరో 50 సీట్లతో సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొండంగల్‌లో మెడికల్ కళాశాలను ప్రారంభించడం బాధాకరమన్నారు. మెదక్ కళాశాలకు 100 సీట్లు మంజూరు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు అన్యాయం జరుగుతోందన్నారు. బీజేపీ ప్రభుత్వం పదేండ్లలో తెలంగాణకు ఏమి చేయలేదన్నారు. దుబ్బాకలో అనేక హామీలిచ్చి ఓటమి పాలైన రఘునందన్‌ను మెదక్ బీజేపీ అభ్యర్థిగా నిలిపారని, ఇక్కడి ప్రజలు అతన్ని నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. కేసీఆర్ ఆశీస్సులతో పోటీ చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని క్యాడర్‌ను ఆమె కోరారు. మాయమాటలు చెప్పి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీ సరిగ్గా అమలు చేయలేదన్నారు. ఏడుపాయల దేవస్థానానికి గత ప్రభుత్వం రూ. 100 కోట్లు మంజూరూ చేస్తూ జీవో జారీ చేసిందని, ఆ నిధులు ఏమయ్యాయని మెదక్ ఎమ్మెల్యేను పద్మాదేవేందర్‌రెడ్డి ప్రశ్నించారు.

### కాంగ్రెస్ వచ్చి ప్రజలకు కష్టాలు తెచ్చింది

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ప్రజలకు కష్టాలు తెచ్చిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీల 420 హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని మాట తప్పిందన్నారు. రైతు భరోసా పెంచుతున్నామని చెప్పి పెంచలేకపోయారని విమర్శించారు. వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను ఆమె కోరారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ బట్టి జగపతి, బీఆర్‌ఎస్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, కో కన్వీనర్లు లింగారెడ్డి, గడ్డమీది కృష్ణాగౌడ్, పార్టీ మెదక్ మండల అధ్యక్షులు అంజాగౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, బట్టి లలిత, జయరాజ్, కిశోర్, మాజీ కౌన్సిలర్లు మాయ మల్లేశం, చంద్రకళ, నాయకులు సోములు, చింతల నర్సింహులు, సంగ శ్రీకాంత్, గట్టేశ్, నగేశ్, శ్రీనివాస్, జగదీశ్, జుబేర్, శ్రీనివాస్‌గౌడ్, మేడిశెట్టి, శంకర్, కిరణ్, అజ్గర్‌అలీ, సున్నం నరేశ్, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.